క్లుప్తంగా

క్యాజువాలిటీలో మానిటర్‌ల ఏర్పాటు



పెద్దాసుపత్రి క్యాజువాలిటీలో ఏర్పాటు చేసిన మానిటర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల క్యాజువాలిటీలో ఐదు మల్టీ చానల్ మానిటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. కోవిడ్ సమయంలో ఆసుపత్రికి వచ్చిన పలు మానిటర్లను అప్పటి అధికారులు స్టోర్‌లో భద్రంగా ఉంచారు. వాటిని బయటకు తీసి క్యాజువాలిటీలో ఉపయోగపడే విధంగా అమర్చారు. మానిటర్ల పనితీరు గురించి ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ రామశివనాయక్ మాట్లాడుతూ.. వీటి ద్వారా రోగుల బీపీ, పల్స్‌రేట్, ఉష్ణోగ్రత, ఈసీజీ వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఎప్పటికప్పుడు స్క్రీన్‌లో వీటిని చూస్తూ రోగికి మెరుగైన వైద్యం అందించేందుకు వీలవుతుందని వివరించారు.

రెడ్ టీ షర్టుల వితరణ



రెడ్ టీషర్టులను ఆవిష్కరిస్తున్న వైద్యులు

కర్నూలు(సెంట్రల్): డిసెంబర్ 30, 31 తేదీల్లో కర్నూలులో జరిగే ఏఐవైఎఫ్ జిల్లా మహాసభల కోసం వైద్యులు హరిప్రసాద్, వసీం హుసేన్ రాజశేఖ్ రెడ్ టీ షర్టులను అందించారు. శుక్రవారం వాటిని మౌర్య ఇన్ హోటల్‌లో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్నలకు అందజేశారు.

ఆర్థిక ప్రణాళిక, బడ్జెట్‌పై అవగాహన



మాట్లాడుతున్న రామచంద్రరావు

కర్నూలు(సెంట్రల్): విద్యార్థి దశ నుంచే ఆర్థిక ప్రణాళిక, బడ్జెట్‌పై అవగాహన పెంచుకోవాలని కర్నూలు జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామచంద్రరావు సూచించారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ వర్కుషాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లీడ్ బ్యాంకు మేనేజర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వివిధ డిపాజిట్ ఖాతాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. యూబీఐ బ్యాంకు మేనేజర్ రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సెల్‌ఫోన్లకు అనవసరంగా వచ్చే మెసేజ్‌లను ఓపెన్ చేయకూడదన్నారు. ఆర్‌యూ గణిత శాస్త్రం హెచ్‌ఓడీ రవికుమార్, కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

జయప్రదం చేయండి



కార్మికులతో మాట్లాడుతున్న కె.సుధాకరప్ప

కర్నూలు(సెంట్రల్): ఎమ్మిగనూరులో డిసెంబర్ 29, 30 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా 23వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నగర ఉపాధ్యక్షుడు కె.సుధాకరప్ప పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం షరీన్ నగర్‌లో కార్మికులను కలుసుకొని జిల్లా మహాసభలకు తరలి రావాలని కోరారు. రెండు రోజులపాటు జరిగే మహాసభల్లో పలు తీర్మానాలను ప్రవేశపెట్టి జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. 29వ తేదీన ఎమ్మిగనూరులో బహిరంగసభ ఉంటుందని, 30వ తేదీన ప్రతినిధుల సభలు ఉంటాయని వెల్లడించారు.

పోలీసు శాఖకు వాహనాలు



పోలీసు శాఖకు కేటాయించిన వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ, ఎస్పీ

కర్నూలు: జిల్లా పోలీసు శాఖకు ఎంపీ నిధుల నుంచి రెండు బొలెరో నూతన వాహనాలను కేటాయించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎస్పీ బిందుమాధవ్‌తో కలిసి శుక్రవారం జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. రాత్రివేళల్లో జిల్లావ్యాప్తంగా పోలీసు గస్తీని పటిష్టంగా నిర్వహించడం ద్వారా నేర నియంత్రణకు చెక్ పెట్టడం, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అత్యవసర సమయాల్లో (ఎమర్జెన్సీ) ఈ వాహనాలను వినియోగించనున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీ భాస్కర్‌రావు, ఎస్‌బీ సీఐ ప్రసాద్, ఆర్‌ఐ నారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆనాడేమంటివి బాబు?

తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, అవసరమైతే మరింత తగ్గిస్తామంటూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు చెప్పారు. ఇదే విషయాన్ని కూటమి పార్టీల నేతలు ఇంటింటికీ వెళ్లి ఊదరగొట్టారు. అయితే అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో మోయలేని భారం మోపింది. ఏకంగా రూ.15 వేల కోట్లకు పైగా భారం మోపడంతో నిరుపేదలు అల్లాడిపోతున్నారు. బిల్లు చెల్లించకపోతే నిర్దాక్షిణ్యంగా విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తుండడంతో అప్పు చేసైనా, పస్తులుండైనా బిల్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ వ్యవహారంపై ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తూ వైఎస్సార్‌సీపీ శుక్రవారం చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అన్ని వర్గాల ప్రజలు ఏకమై విద్యుత్ చార్జీలు తగ్గించాలని నినదించడంతో జిల్లా కేంద్రం నిరసనలతో హోరెత్తింది.

- సీఎంకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి సూటి ప్రశ్న
- ఆరు నెలల పాలనలో అభివృద్ధి, సంక్షేమం ఎక్కడ?
- హామీలను అమలు చేయని కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు
- విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, నిరసనలు
- విద్యుత్ ఈఈకి వినతిపత్రం సమర్పణ



విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య, అహ్మద్ అలీఖాన్, సురేందర్ రెడ్డి, సుభాష్ చంద్రబోస్, పార్టీ శ్రేణులు

కర్నూలు (టౌన్): పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించకుంటే ప్రజా పోరును ఎదుర్కోక తప్పదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు.. విద్యుత్ చార్జీలు తగ్గించాలన్న డిమాండ్‌తో శుక్రవారం నగరంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల నుంచి ఆర్‌ఎస్ రోడ్డు సర్కిల్ మీదుగా ర్యాలీగా బయలుదేరి కేవీఆర్ కళాశాల ఎదురుగా ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయం పవర్ హౌస్‌కు చేరుకున్నారు. 'సీఎం డౌన్, డౌన్, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి. ప్రజలను మోసం చేసిన చంద్రబాబు డౌన్ డౌన్' అంటూ కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను ఒక్క రూపాయి కూడా పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రెండు సార్లు చార్జీలను పెంచిందన్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకులు, రిజిస్ట్రేషన్ చార్జీల మోతతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మరోసారి విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజల నడ్డి విరిగే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజలపై రూ.15,483 కోట్ల విద్యుత్ భారం మోపారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం సంపద సృష్టి పేరుతో ప్రజలపై పన్నుల భారం మోపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎడాపెడా అప్పులు చేయడంతో పాటు ఆరు నెలల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. గత జగనన్న పాలన, ప్రస్తుత చంద్రబాబు పాలనపై ప్రజలకు ఇప్పటికే స్పష్టత వచ్చిందని, మోసపూరిత హామీలతో గద్దెనెక్కి ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు.



ర్యాలీలో నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, చిత్రంలో మేయర్ బీవై రామయ్య తదితరులు



విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద మోహరించిన పోలీసులు

నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. ఆరు నెలల కూటమి పాలనలో సీఎం చంద్రబాబు సంక్షేమం పేరుతో ప్రజలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. అబద్ధాలకు పేటెంట్ చంద్రబాబు అని, సూపర్ సిక్స్ హామీలతో ఇంటింటికీ సంక్షేమం అందిస్తామని చెప్పి ప్రజలను మోసం చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీల మోతతో పేదలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, రెండుసార్లు ముఖ్యమంత్రిగా అనుభవం ఉన్న చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాడని నమ్మి ప్రజలు ఓట్లు వేస్తే పన్నులు పెంచడం తప్పా చేసిందేమి లేదని విమర్శించారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పిందని, ఆరు నెలల పాలనలో ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడం అన్యాయమన్నారు. టిక్నాలజీని వినియోగించుకుంటూ అభివృద్ధి చేస్తానని, పన్నులు పెంచను అని పదే పదే చెప్పిన చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశాడన్నారు. ప్రజలకు అబద్ధాలు చెప్పిన చంద్రబాబు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయమంటే ప్రజలకు హైటెన్షన్ షాక్ ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ నేతలు అహ్మద్ అలీఖాన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్, గడ్డం రామకృష్ణ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల తరఫున నిరంతరం పోరాటలు సాగిస్తామన్నారు. గతంలో ప్రజా ఉద్యమాలతోనే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాడని గుర్తు చేశారు. ఆరు నెలల పాలనలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని స్పష్టం చేశారు. పెంచిన విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు, పార్టీ శ్రేణులతో కలిసి పవర్ హౌస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషాద్రికి వినతి పత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, పార్టీ నాయకులు షరీఫ్, కిషన్, నాగవేణి రెడ్డి, ఆదిమోహన్ రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి అనుబంధ విభాగాల అధ్యక్షుడు రాఘవేంద్రనాయుడు, కార్పొరేటర్లు జుబేర్, షేక్ యూనూస్‌బాషా, షేక్ అహమ్మద్, షేక్షావలీ, విక్రమసింహారెడ్డి, మణేమ్మ, రాజేశ్వరరెడ్డి, పెద్దఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

చంద్ర'బాదుడు'పై జనాగ్రహం



ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పార్టీ శ్రేణులు

కల్లూరు: రాష్ట్రంలోని ప్రజలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ పోరుబాట నిర్వహించింది. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల కాటసాని రాంభూపాల్ రెడ్డి సంతాపం తెలిపారు. అనంతరం కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ర్యాలీ ప్రారంభించారు. కాటసాని స్వగృహం నుంచి బళ్లారి చౌరస్తా మీదుగా విద్యుత్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు ఇచ్చిన హామిలను అమలు చేయాలని, చంద్ర'బాదుడు' మానుకోవాలని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొనసాగించాలని, ఎన్నికలో హామీ ఇచ్చిన విధంగా విద్యుత్ చార్జీల పెంపును నిలుపుదల చేయాలని నినాదాలు చేశారు. అనంతరం విద్యుత్ కార్యాలయం వద్ద ఎస్ఈ ఉమాపతికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అన్నారు. ఎన్నికలో లబ్ధి పొందేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై దుష్ప్రచారం చేశారని, తీరా ఎన్నికలో గెలిచాక ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. ఎన్నికల సభలలో విద్యుత్ చార్జీలు పెంచబోమని బూటకపు మాటలు చెప్పి ఆరు నెలల పాలనలోనే రెండు సార్లు చార్జీలు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పెంచిన విద్యుత్ చార్జీల వల్ల కర్నూలు జిల్లాలో ప్రజలపై 25 కోట్ల భారం పడుతుందన్నారు. నిత్యావసర వస్తువులు ధరలు పెరగడం దానికి తోడు విద్యుత్ చార్జీలు పెరగడంతో సామాన్య ప్రజలు, చిన్న పరిశ్రమలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ప్రజలకు మంచి చేయాలని ఆలోచన కూటమి ప్రభుత్వానికి లేదన్నారు.

మన్మోహన్ సింగ్ సేవలు అమోఘం



మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ సేవలు అమోఘం అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో మాజీ ప్రధాని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి దేశ పునర్నిర్మాణంలో మన్మోహన్ ఎనలేని కృషి చేశాడన్నారు. నిజాయితీకి నిలువుటద్దంలాంటి వ్యక్తి అని కొనియాడారు. పార్టీ నేతలు అహ్మద్ అలీఖాన్, తెర్నేకల్ సురేంద్రరెడ్డి, మద్దూరు సుభాష్ చంద్రబోస్, గడ్డం రామకృష్ణ, కిషన్, శరీఫ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరనిలోటు

కర్నూలు(సెంట్రల్): మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటు అని డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం డీసీసీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ సంతాప సభను నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక సంస్కరణలకు మన్మోహన్‌సింగ్ ఆద్యుడన్నారు. ఆయన మరణం పట్ల కాంగ్రెస్ కమిటీ తరఫున సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు, సత్యనారాయణగుప్తా పాల్గొన్నారు.

నగరంలో నేడు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: నగరంలోని క్యాంపు సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ల ఆధునీకరణలో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు శ్రీలక్ష్మీనగర్, ఆరోరానగర్, టెలికాం నగర్, కమలా నగర్, డాక్టర్స్ కాలనీ, గఫూర్ నగర్, సోమప్ప కాలనీ, బీ క్యాంపు, పోస్టాఫీసు సర్కిల్, మహాలక్ష్మి నగర్, జేసీ బంగ్లా, అమ్మ ఆసుపత్రి పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నెట్‌బాల్ జాతీయ పోటీలకు ఎంపిక

కర్నూలు (టౌన్): ఈనెల 29 నుంచి చెన్నై నగరంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు అశీష్ సుహాస్, మనోజ్‌కుమార్, జెస్సికా, జయశ్రీలను శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో అభినందించి క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. నెట్‌బాల్ సంఘం వ్యవస్థాపకులు నాగరత్నమయ్య, అధ్యక్షులు నాగేశ్వర బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు గీతాంజలి, సుభాన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


లలితా పీఠంలో ధనుర్మాస పూజలు



స్వామివారికి 108 గిన్నెల్లో నైవేద్యం సమర్పించిన భక్తులు

కర్నూలు (సెంట్రల్): ఓల్డ్‌సిటీలో జమ్మిచెట్టు పక్కనున్న లలితా పీఠంలో ధనుర్మాస పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పూలంగి సేవ, కూడారై సేవ నిర్వహించారు. కూడారై సేవలో భాగంగా 108 గిన్నెలలో స్వామివారికి సమర్పించిన ప్రసాదాన్ని దేవస్థానానికి వచ్చిన భక్తులకు వితరణ చేశారు. కర్నూలు వేంకటేశ్వర అన్నమాచార్య సేవా ట్రస్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో తిరుప్పావై పారాయణం, కర్నూలుకు చెందిన శ్రీపుల్లారెడ్డి బృందం, శ్రీ విష్ణు సహస్ర నామ సత్సంగం, కార్యక్రమాలు భక్తులను అలరించాయి. రాత్రి 8 గంటలకు మహా అన్నప్రసాదాన్ని వితరణ చేసినట్లు పీఠాధిపతి సుబ్రహ్మణ్యస్వామి తెలిపారు.

ఉర్దూకు జీవం పోసిన కవి గాలిబ్



మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): ఉర్దూ బాషాకు జీవం పోసిన కవి మిర్జా గాలిబ్ అని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సులర్ పీఎస్ షా వలిఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం వర్సిటీలో కవి మిర్జా గాలిబ్ జయంతిని పురస్కరించుకొని గాలిబ్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిర్జా గాలిబ్ కవిత్వం ఉర్దూకు నిధి మాత్రమే కాదని, జీవితంలోని సంక్లిష్టతలను ప్రతిబింబించేందుకు అద్దం పడుతుందన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లోకనాథ్ మాట్లాడుతూ.. గజల్స్, ద్విపదాల ద్వారా భావోద్వేగాలను సంగ్రహించడం గాలిబ్‌కు మాత్రమే సాధ్యమైందన్నారు. వర్సిటీ పాలక మండలి సభ్యురాలు అజ్రా జావేద్ మాట్లాడారు. అనంతరం వీసీ, రిజిస్ట్రార్ ఉర్దూ యూనివర్సిటీ గేయాన్ని విడుదల చేశారు.

ఉర్దూ వర్సిటీలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

కర్నూలు(సెంట్రల్): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో విద్యార్థుల సౌకర్యార్థం వర్సిటీ పాలక మండలి సభ్యుడు నవీద్ పర్వేజ్ ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను వీసీ పీఎస్ షావలి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లోకనాథ ప్రారంభించారు. విద్యార్థులకు మంచినీటి కోసం ఇబ్బంది కలగకుండా నూతనంగా మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటుకు సహరించిన దాత నవీద్ పర్వేజ్‌కు ధన్యవాదాలు తెలిపారు. పాలక మండలి సభ్యులు అజ్రాజావేద్, జీఎండీ ఇబ్రహీం పాల్గొన్నారు.

పోషకాహారం పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని సొసైటీ ఫర్ రూరల్ అండ్ ఇకో డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో సీఎస్‌ఐ ఆరాధన చర్చి వారి సహకారంతో శుక్రవారం హెచ్‌ఐవీ బాధితులకు పోషకాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎస్‌ఐ చర్చి వారి స్ఫూర్తితో అనేక మంది దాతలు హెచ్‌ఐవీ బాధితులకు సహాయం అందించాలని కోరారు. చర్చి చైర్మన్ ప్రసన్నకుమార్ బాబు మాట్లాడుతూ.. ఎయిడ్స్ మహమ్మారి సోకిన వారు మానసికంగా కుంగిపోకుండా మనోధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఏపీ విజయ్‌కుమార్, ప్రాజెక్టు మేనేజర్ మునీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో మర్చిపోయిన దుస్తులు అప్పగింత

కర్నూలు: కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగార్జున్ ఆటోలో మర్చిపోయిన నూతన దుస్తులను పోలీసులు తిరిగి అప్పగించారు. ఈనెల 26వ తేదీ కర్నూలు పాతబస్తీలోని శ్రీనివాస క్లాత్ మార్కెట్‌లో షాపింగ్ చేసి ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. దిగేటప్పుడు దుస్తుల బ్యాగ్‌ను ఆటోలో మర్చిపోయి ఇంటికి వెళ్లాడు. తర్వాత గుర్తు చేసుకుని కర్నూలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు సీసీ ఫుటేజీ ద్వారా ఆటోను గుర్తించారు. శుక్రవారం సాయంత్రం కమాండ్ కంట్రోల్ రూమ్‌కు డాక్టర్ పిలిపించి ఆటోలో మర్చిపోయిన దుస్తులను తిరిగి అప్పగించారు. వన్‌టౌన్ సీఐ ఎం.రామయ్యనాయుడు, కమాండ్ కంట్రోల్ సీఐ శివశంకర్, తదితరులు ఉన్నారు.

5 నుంచి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్

కర్నూలు (టౌన్): బీహార్ రాష్ట్రంలోని పునర్ని పట్టణంలో జనవరి 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు 53వ జాతీయస్థాయి సీనియర్ మహిళా హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22, 23 తేదీల్లో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జాతీయ స్థాయికి ఎంపిక చేస్తున్నట్లు వెల్లడించారు.

అన్న క్యాంటీన్ల వద్ద శుభ్రత పాటించాలి

కర్నూలు (టౌన్): అన్న క్యాంటీన్ల వద్ద శుభ్రత పాటించాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. శుక్రవారం స్థానిక కొండారెడ్డి బురుజు సమీపంలోని పూలమార్కెట్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పేదలకు మూడు పూటలా రుచికరమైన భోజనం అందించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అన్న క్యాంటీన్లను ప్రారంభించిందని, వాటి నిర్వహణలో, భోజనంలో నాణ్యత పాటించాలని ఆదేశించారు.

ఉచిత కుట్టుమిషన్ శిక్షణ



కుట్టుమిషన్ శిక్షణ పొందుతున్న మహిళలతో వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): నగరంలోని రామచంద్ర నగర్‌లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న రాణి ఝాన్సీలక్ష్మీబాయి ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వీహెచ్‌పీ దక్షిణాంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. హిందూ యువతులు, మాతృమూర్తులకు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చి వారు స్వయం ఉపాధి పొందాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసినట్లు వివరించారు. నాయకులు కోటేశ్వరరావు, బ్రహ్మానందరెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజకీయాలకు దూరంగా ఉంటా..

కర్నూలు (టౌన్): ఇక నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటానని, కొంతకాలంగా బంధుమిత్రులు, శ్రేయోభిలాషులతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇంతియాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని నెలల క్రితం ప్రజాసేవ ధ్యేయంగా ఐఏఎస్ సర్వీసు నుంచి వీఆర్‌ఎస్ తీసుకొని రాజకీయాల్లోకి వచ్చానని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో కర్నూలు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశానని తెలిపారు. ప్రస్తుతం ఒక రిటైర్డు ఐఏఎస్ అధికారిగా సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిగా సాహితీవేత్తగా మెరుగైన సమాజం కోసం తన వంతు కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆరు నెలల కాలంలో సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సామాజిక రుగ్మతలు, అసమానతలను రూపుమాపేందుకు, పర్యావరణ కాలుష్యం తగ్గించేందుకు స్వచ్ఛంద సంస్థలతో కలిపి పనిచేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

హొళగుంద: మండలంలోని చిన్నహ్యాట కొండలో పేకాట ఆడుతున్న ఏడుగురుని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ బాల నరసింహులు శుక్రవారం తెలిపారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు కొండలో పేకాట ఆడుతుండగా దాడి చేసి ఏడుగురిని అదుపులో తీసుకుని రూ.19,590 నగదు, 6 బైకులు, పేక ముక్కలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఘనంగా కాటసాని జన్మదిన వేడుకలు

కల్లూరు: వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముందుగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని ఉమామహేశ్వరమ్మ దంపతులను వేద పండితులు ఆశీర్వదించారు. నియోజకవర్గంలోని కల్లూరు అర్బన్, పాణ్యం, గడివేముల, ఓర్వకల్లు, కల్లూరు గ్రామీణ మండలాల నుంచి నాయకులు, కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి కాటసానికి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుడు భీమేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, బెల్లం మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి